

నల్లకుంట టీఆర్‌టీ క్వార్టర్స్‌లో గ్రౌండ్‌లో బాడ్మింటన్ కోర్టు ప్రహరీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని టీఆర్‌టీ క్వార్టర్స్‌లో నిరుపయోగంగా ఉన్న గ్రౌండ్‌లో బాడ్మింటన్ కోర్టు ఏర్పాటుకు రూ. 16 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులను కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. టీఆర్‌టీ క్వార్టర్స్‌లో పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్వార్టర్స్‌లోని పార్కులలో చెత్త, చెదారం పేరుకుపోవడంపై జీహెచ్‌ఎంసీ అధికారులను ఆయన ప్రశ్నించారు. పార్కులో పడిపోయే స్థితిలో ఉన్న చెట్టును తరలించడానికి వాహనం లేదు, సిబ్బంది లేరు అని జీహెచ్‌ఎంసీ అధికారులు ఎమ్మెల్యేకు తెలపడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చిన్న సమస్యలను పరిష్కరించడంలో సాకులు చూపడం తగదని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నల్లకుంట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, నాయకులు ఎం.భూపతినాథ్, అనిత, డివిజన్ బీజేపీ అధ్యక్షులు కె.ప్రశాంత్ జోషి, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్‌యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి మహేష్‌కుమార్, నాయకులు రాజశేఖర్, కె.బి.నర్సింగ్‌రావు, జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, ఏఈలు నరేందర్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని అపార్ట్‌మెంట్‌వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. శుక్రవారం సాయంత్రం డివిజన్‌లోని న్యూ నల్లకుంటలోని అపార్ట్‌మెంట్ అసోసియేషన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌లో నెలకొన్న సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. అపార్ట్‌మెంట్‌వాసుల సమస్యలను జీహెచ్‌ఎంసీ, జలమండలి, ట్రాన్స్‌కో, హార్టికల్చర్ శాఖల అధికారులతో చర్చించి పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆమె వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్


బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ అన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరి ధరించాలిని, లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. రోడ్ సేఫ్టీ మాసోత్సవాల సందర్భంగా కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బర్కత్‌పుర చమాన్‌వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే జరిమానా తప్పదన్నారు. హెల్మెట్ ధరించకపోతే ప్రమాదాలు జరిగినప్పుడు కొన్ని సందర్భాలలో వాహనదారుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. సిగ్నల్స్ వద్ద వాహనదారులు నిబంధనలు పాటించాలని, రాంగ్ రూట్‌లో వెళితే ప్రమాదాలకు గురికాక తప్పదన్నారు. కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ ఎస్‌ఐ గఫత్, సిబ్బంది భిక్షం, నగేష్, రాంరెడ్డి, నరేష్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడ చప్పల్‌బజార్‌లో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎక్కాల కన్నా, పాట్కూరి శ్రీనివాస్ తదితరులు

పారిశుధ్య సిబ్బందికి దుప్పట్ల పంపిణీ

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ చప్పల్‌బజార్‌లో శుక్రవారం పాట్కూరి అశోక్ ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బందికి దుప్పట్ల పంపిణీ, అన్నదాన నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎక్కాల కన్నా, పాట్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొని దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ సిబ్బందికి అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాట్కూరి అశోక్ వివాహం జరిగి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కార్యక్రమం నిర్వహించారని, ఈ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సి.వినోద్‌కుమార్, సాగర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్ దొంగ వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ జావేద్

ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రయాణికుడి ల్యాప్‌టాప్‌ను తస్కరించిన దొంగను కాచిగూడ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి ల్యాప్‌టాప్ ఇతర ఎలక్ట్రికల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్, కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప, ఆర్‌పీఐ సీఐ మాల్‌తో కలిసి దొంగ వివరాలను వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం కోలూరు జిల్లా మాటూరు గ్రామానికి చెందిన నవీన్‌కుమార్(24) నగరంలోని ఇస్లాంపూర్‌లో నివాసం ఉంటూ ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జల్సాల కోసం దొంగతనం ఎంచుకున్నాడు. గత డిసెంబర్ 21న రైల్వే ప్రయాణికుడి ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే పోలీసులు పట్టుకుని విచారించగా తాను చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్నాడు. అతని నుంచి ల్యాప్‌టాప్, వైఫై రోటర్, మౌజ్, రిస్ట్ వాచి, పవర్ బ్యాంక్, చార్జర్‌తో పాటు 80 వేల రూపాయల విలువల గల వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నవీన్‌కుమార్‌ను రైల్వే కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అంబర్‌పేటలో అంధకారం

● వెలగని వీధి దీపాలు ● ఇబ్బందుల్లో స్థానికులు

అంబర్‌పేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాలలో వీధి దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా డివిజన్‌లోని బాపునగర్, చెన్నారెడ్డినగర్, న్యూ పటేల్‌నగర్, పటేల్‌నగర్, అహ్మద్‌నగర్, చిలకమ్మగల్లీ, సీపీఎల్ పోలీసు లైన్, రాజయ్యగల్లీ, సరస్వతి స్కూల్ పరిసర ప్రాంతాలలో వీధి దీపాలు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఈ ప్రాంతంలో రావాలంటే స్థానికులు భయపడుతున్నారు. రహదారులపై పలుచోట్ల గుంతలు ఉండడంతో వాహనదారులు రాత్రి వేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతాలలో వీధి దీపాలు లేక అంధకారం నెలకొంటుందని, దీంతో రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



పటేల్‌నగర్‌లో వీధి దీపాలు వెలగక చీకటి

అధికారులు స్పందించాలి



సరస్వతీ స్కూల్ పరిసర ప్రాంతాలలో గత కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు వెంటనే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

-రాంచందర్‌గుప్తా, పటేల్‌నగర్

రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నాం



బస్తీలో వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో రాకపోకలు సాగించడంలో ఇబ్బందులకు గురవుతున్నాం. రాత్రి వేళ ఈ ప్రాంతంలో తీవ్ర అంధకారం రాజ్యమేలుతుంది. ఈ సమస్యపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

- సుహాసిని, స్థానికురాలు, అంబర్‌పేట

త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

అంబర్‌పేట డివిజన్‌లో వీధి దీపాల సమస్యను త్వరలో పరిష్కరిస్తాం. సంబంధిత ఏజెన్సీకి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే చెప్పాం, వీధి దీపాల ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి త్వరలో సమస్య పరిష్కరిస్తాం.

-సౌమ్య, ఏఈ,
అంబర్‌పేట సర్కిల్

42 శాతం రిజర్వేషన్ కోసం బీసీలు పోరాటం చేయాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య



బీసీ మేధావుల సదస్సులో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, మధుసూదనచారి, వకుళాభరణం, గుజ్జ సత్యం తదితరులు

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవడానికి బీసీలు పోరాటం చేయాలని ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల శాతం పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర స్థాయిలో అడ్డుకుంటామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని ఆయన హెచ్చరించారు. అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో బీసీ మేధావుల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో బీసీలు ఉద్యమం చేపడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి అన్ని సమస్యలను పరిష్కరిస్తాయని అన్నారు. బీసీలది ఆకలి పోరాటం కాదని ఆత్మగౌరవ పోరాటం అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ మేధావులు, సామాజిక వేత్తలు, అఖిలపక్ష నేతలు, న్యాయ నిపుణులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనచారి మాట్లాడుతూ రాజ్యాధికారం సాధిస్తేనే బీసీల అన్ని సమస్యల పరిష్కారమవుతుందన్నారు. ప్రస్తుతం బీసీలకు అందుతున్న సంక్షేమ పథకాలపై సమగ్రమైన చర్చ జరగాలని అన్నారు. బీసీలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, హక్కుల సాధనకై నిరంతరం పోరాటం చేయాలన్నారు. బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు రాములు, వెంకటేష్, మల్లేష్ యాదవ్, వేముల రామకృష్ణ, అనంతయ్య, రాజేందర్, జయంతిగౌడ్, కోటేశ్వరి, రాందేవ్‌మోదీ, శేఖర్, శంకర్, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్‌కు జీతాలు పెంచాలి

● టీయుసీఐ నేతల డిమాండ్

రాంనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో 485 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న 6 వేల మంది నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్‌కు బేసిక్ పే చెల్లించాలని, వేతనాలు పెంచాలని అన్ని రెసిడెన్షియల్ విద్యా సంస్థలతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ అనుబంధం) అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, పి.అరుణ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి మెడికల్ ఇన్సూరెన్స్‌ను కల్పించాలని, డ్యూటీలో ఉండి చనిపోయిన కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ రూ.లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీ సిబ్బందిపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 12 గంటలు పనిచేయిస్తూ కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్న పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎలాంటి ప్రయోజనాలు నెరవేర్చడం లేదన్నారు. తీవ్ర పనిభారంతో అనారోగ్యంతో ఉద్యోగ భద్రత లేకుండా నిత్యం సమస్యలతో కేజీబీవీ సిబ్బంది జీవితాలను వెళ్లదీస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రేణుక, మౌనిక, అరుణ, మధుర, భద్రమ, వినోద, రాజేశ్వరి, సైదమ్మ, లక్ష్మి, అశోక్, సుధాకర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్.ఎల్.పద్మ

ఇమ్రాన్ హుస్సేన్ గుండెపోటుతో మృతి

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌కు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ హుస్సేన్(47) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య ఒక కూతురు ఉన్నారు. బీజేపీలో చురుకైన పాత్ర పోషించడంతో ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌తో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు అక్లక్‌హుస్సేన్, మున్వర్ చాంద్, జునేద్‌బాగ్దాదీ, బీజేపీ రాష్ట్ర నాయకులు నందగిరి నర్సింహ, ఆర్ విశ్వం, కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్, మాజీ కార్పొరేటర్లు అఖిల్, వాజీద్ హుస్సేన్‌లు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు భోలక్‌పూర్ బడీమసీద్ సమీపంలో జరిగాయి.

అక్రమ నిర్మాణంపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు

ఉప్పల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌లో అక్రమ నిర్మాణంపై పక్కనే ఉన్న యజమాని జీహెచ్‌ఎంసీ ఈస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ హేమంత కేశవపాటిల్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం జోనల్ కమిషనర్‌ను కలిసిన పక్కన ఉన్న ప్లాటు యజమాని యాదవరెడ్డి ఉప్పల్ సర్కిల్ గణేష్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న తన కూతురు గాయత్రిదేవికి ఇచ్చిన ప్లాటు పక్క ప్లాటు యజమాని ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండానే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన పక్క ప్లాటులో సెట్ బ్యాక్ లేకుండా ఇల్లు నిర్మిస్తున్నారని పునాది వేసినప్పటి నుంచి ఫిర్యాదు చేసినా ఉప్పల్ సర్కిల్ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. అక్రమ నిర్మాణాన్ని ఆపకుండా కేవలం నోటీసు లు ఇచ్చి కాలయాపన చేశారని పేర్కొన్నారు. రెండంతస్తులకు అనుమతి తీసుకొని మూడంతస్తుల స్లాబ్ వేశారని, తనప్లాటు ప్రహరీ కూలిపోయేలా డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తానని ఆయన హెచ్చరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతను అడ్డుకున్న ఇద్దరిపై కేసు

బిట్స్‌పిలాని, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కార్పోరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయకుండా ప్రభుత్వ అధికారులను అడ్డుకున్న ఇరువురిపై కేసు నమోదు చేసినట్టు జవహర్‌నగర్ సీఐ సైదయ్య శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌లోని సర్వేనంబర్ 702లోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వాటిని కూల్చేందుకు కాప్రా తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు ఆర్‌ఐ రమేష్ సిబ్బందితో కలిసి వెళ్లగా అక్రమ నిర్మాణాలను కూల్చకుండా రామునాయక్, శేఖర్ అడ్డుకున్నారు. వీరిపై తహసీల్దార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.



సీసీ రోడ్డు ప్యాచ్‌వర్కు పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు పూస గోరక్‌నాథ్, కె. బాబూరావు

బాపూజీనగర్‌లో సీసీ రోడ్డు ప్యాచ్‌వర్కు పనులు

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో అధ్వానంగా మారిన రోడ్లను ఆధునీకరించాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్, కె.బాబూరావు డిమాండ్ చేశారు. శుక్రవారం బాపూజీనగర్‌లో సైకిల్ టెక్స్ సమీపంలో జీహెచ్‌ఎంసీ అధికారులు సీసీ రోడ్డుకు ప్యాచ్‌వర్కు పనులు చేపట్టారు. ఈ పనులు పరిశీలించిన పూసగోరక్‌నాథ్, బాబూరావులు మాట్లాడుతూ అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే ఆధునీకరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. గాంధీకుటీర్, జామై ఉస్మానియా పరిధిలోని విఠల్‌వాడీ, నారాయణ కాలేజ్, నాగయ్య హోటల్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30 వరకు, ఫీవర్ ఆస్పత్రి పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి తదితర ప్రాంతాల్లో 12 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముగ్గుల పోటీలకు బొట్టుపెట్టి ఆహ్వానం

చిక్కడపల్లి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు బోనం ఊర్మిళ తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో పాల్గొనాలని కోరుతూ ఆమె గాంధీనగర్ డివిజన్‌లో నిమహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె జవహర్‌నగర్‌లోని తన నివాసంలో మాట్లాడుతూ ఈనెల 19న ఆదివారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఈపోటీలు జరుగుతాయన్నారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తివున్న మహిళలు 7989438283 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



ముషీరాబాద్ యాదవ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, అన్ని పార్టీల నేతలు

యాదవులు హక్కుల సాధనకు ఉద్యమించాలి

కవాడిగూడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన యాదవ కులస్థులు అన్ని రంగాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు హక్కులను సాధించుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవులంతా ఏకతాటిపైకి రావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అఖిల భారత యాదవ మహాసభ పిలుపుమేరకే ముషీరాబాద్ యాదవ మహాసభ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం దోమలగూడలోని యాదవ మహాసభ కార్యాలయంలో యాదవ మహాభ నాయకులు వల్లాల శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాశం అనిల్‌కుమార్‌యాదవ్, సత్యనారాయణ యాదవ్, జామకాయల అశోక్‌యాదవ్, వెంకటరమణ యాదవ్, సింధం శ్రీశైలం, బలరాంయాదవ్, మల్లికార్జున్‌యాదవ్‌తోపాటు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యాదవ కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బ్రహ్మారాంబ మల్లికార్జున స్వామి ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు తుమ్మరాజు, సురేష్ కుమార్

మల్లన్న బ్రహ్మోత్సవాలు విజయవంతం

ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరి సహకారంతో బ్రహ్మారాంబ మల్లికార్జున స్వామి (మల్లన్న) బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసాయని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. స్వామివారి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినందుకు శుక్రవారం స్థానిక నాయకులు తుమ్మరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేష్ కుమార్, రాజు, తదితరులు ఆలయ ప్రాంగణంలో అంజిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిళ, వివిధ పార్టీల నాయకులు రామానందరెడ్డి, అర్జున్ యాదవ్, సతీష్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం గౌడ్, తదితరులు

అవినీతిపరులు జైలుకు వెళ్లడం ఖాయం

● పట్నం నాగభూషణం గౌడ్

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడిన నేతలు జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ ఈ కార్ రేసులో అవినీతికి పాల్పడినందుకే ప్రభుత్వం విచారణ జరిపిస్తున్నదని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరీఫ్, అమరేందర్ గౌడ్, ప్రేమ్‌కుమార్, సోహెల్ పాల్గొన్నారు.

నేడు భోలక్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భోలక్‌పూర్ బడీ మసీద్ వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఎస్‌ఆర్‌డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్, రక్త పరీక్షలు తోపాటు ఉచితంగా మందులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నామినేటెడ్ పోస్టులకు అంబర్‌పేట కాంగ్రెస్ నేతల ఎదురుచూపు

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి తర్వాత నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఇటీవల ప్రకటించడంతో అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన నేతల్లో కదలికలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాది పూర్తయిన సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గోల్నాక డివిజన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి చెందిన కొంత మంది నేతలకు నామినేటెడ్ పోస్టులలో న్యాయం చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేస్తారన్న బలమైన ప్రచారం జరుగుతుండడంతో ఈ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు నామినేటెడ్ పోస్టులు దక్కుతాయనే ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ నియోజకవర్గానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్‌యాదవ్, యువజన కాంగ్రెస్ గ్రేటర్ అధ్యక్షుడు మోత రోహిత్‌లకు నామినేటెడ్ పోస్టులు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం సమావేశంలోనే ఆనాడు ప్రకటించారు. వారితోపాటు మరికొంత మంది నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవి రమేష్, పుల్లా నారాయణ స్వామి, పులి జగన్, టీపీసీసీ కార్యదర్శులు లక్‌పతి యాదగిరిగౌడ్, శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఎన్. అజయ్‌కుమార్, టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీ.బీ. శ్యామ్‌రావు, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రామ్మోహన్‌రావు, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, మన్నె మహేష్‌యాదవ్, ఎన్ఎస్‌యుఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి, మేదర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కే.పీ. మురళీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్‌రెడ్డి, సీ. హెచ్. మురళీకృష్ణ, మునగాల శ్యామ్‌రావు, ఫరీద్ తదితరులు నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్నారు. నాయకులు ఎవరిస్థాయిలో వారు పై నాయకత్వాన్ని కలుస్తూ బయోడేటాలను సమర్పిస్తూ తమకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరుతున్నారు. పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిందని ప్రస్తుతం తిరిగి అధికారంలోకి వచ్చిందని ఇప్పుడైనా తమకు న్యాయం చేయాలని వారు పార్టీ అధిష్టానాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిలను కోరుతున్నారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఈ నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ ఎంపీ వి. హనుమంతరావు, నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డిల ఆశీస్సులు ఎంత మందికి ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.